సాక్షి ఆదిలాబాద్
శుక్రవారం । 7 । ఏప్రిల్ । 2023



తరోడ వాగులో అంబులెన్స్ బోల్తా
జైనథ్ మండలం తరోడ వాగులో మహారాష్ట్రకు చెందిన అంబులెన్స్ బోల్తా పడ్డది. అందులో ప్రయాణిస్తున్న ఐదుగురు చాకచక్యంగా ఒడ్డుకు చేరారు. 10లో▸



మౌలిక వసతుల కల్పనకు కృషి
ఆదిలాబాద్ రైల్వేస్టేషన్‌లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తామని నాందేడ్ రైల్వే డీఆర్ఎం నునితి సర్కార్ పేర్కొన్నారు. గురువారం రైల్వేస్టేషన్‌ను పరిశీలించారు. 10లో▸

గరిష్టం/కనిష్టం
37.0/25.0

వాతావరణం
ఆకాశం నిర్మలంగా, ప్రకాశవంతంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత పెరుగుతుంది. ఉక్కపోత అధికమవుతుంది.

రంజాన్ వేళలు

ఇఫ్తార్	సహర్
శుక్ర 6:31	శని 4:42

న్యూస్‌రీల్

ఘనంగా బీజేపీ ఆవిర్భావ దినోత్సవం



పార్టీ జెండా ఆవిష్కరిస్తున్న పాయల్ శంకర్

ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయం వద్ద గురువారం పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్ బీజేపీ జెండా ఆవిష్కరించారు. పార్టీ వ్యవస్థాపకుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రతీ కార్యకర్త క్రమశిక్షణతో సైనికుడిలా పని చేయాలని పిలుపునిచ్చారు. క్రమశిక్షణకు మారుపేరు బీజేపీ అని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు చిట్యాల సుహాసినిరెడ్డి, నాయకులు అంకత్ రమేశ్, ఆదినాథ్, జోగు రవి, చిల్కూరి జ్యోతిరెడ్డి, లాలామున్న, కృష్ణయాదవ్, రఘుపతి, సూర్యకిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సై పరీక్షకు స్పెషల్ బస్సు

ఆదిలాబాద్: ఈనెల 8వ తేదీన నిర్వహించనున్న ఎస్సై పోటీ పరీక్షకు వెళ్లే అభ్యర్థుల కోసం ఆదిలాబాద్ నుంచి కరీంనగర్‌కు ప్రత్యేక బస్సు నడుపనున్నట్లు ఆర్టీసీ డిపో మేనేజర్ కల్పన ఓ ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 3.30 గంటలకు బస్సు ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. http:// www.tsrtconline.in లో లేదా ఆదిలాబాద్ ఆర్టీసీ బస్టాండ్‌లోని రిజర్వేషన్ కౌంటర్ వద్ద ముందస్తు రిజర్వేషన్ చేసుకోవచ్చని తెలిపారు.

అంబేద్కర్ విగ్రహావిష్కరణకు జిల్లా వాసులు

కైలాస్‌నగర్: ఈ నెల 14న హైదరాబాద్‌లో 125 అడుగుల అంబేద్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి జిల్లా ప్రజలను తరలించనున్నట్లు కలెక్టర్ రాహుల్‌రాజ్ తెలిపారు. సీఎస్ శాంతికుమారి గురువారం హైదరాబాద్ నుంచి కలెక్టర్లతో గొర్రెల పంపిణీ, అంబేద్కర్ జయంతి వేడుకలపై నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన పాల్గొన్నారు. అనంతరం జిల్లా అధికారులతో సమీక్షించారు. ఆదిలాబాద్, బోథ్ నియోజకవర్గాల నుంచి 300మంది చొప్పున హైదరాబాద్‌కు తరలించనున్నట్లు తెలిపారు. స్థానిక ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులతో సమన్వయం చేసుకుంటూ కార్యక్రమానికి వెళ్లే వారి వివరాలు ఈ నెల 10లోగా అందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. మండల కేంద్రం నుంచి ఉదయం 6గంటలకు బస్సులు బయలుదేరాలని, అవసరమైన అన్ని ఏర్పాట్లు చేపట్టాలని సూచించారు. ప్రజలకు అల్పాహారం, భోజనాలు ఏర్పాట్లు చేయాలని, ప్రతీ బస్సులో లైజన్ అధికారిగా పంచాయతీ సెక్రటరీ, పోలీస్ అధికారి, వైద్యసిబ్బంది, ఇద్దరు ఆఫీస్ సబార్డినేట్లను నియమిస్తామన్నారు. వీసీలో అడిషనల్ కలెక్టర్ ఎన్.నటరాజ్, ఆర్డీవోలు రమేశ్‌రాథోడ్, కదం సురేశ్, డీపీవో శ్రీనివాస్, డీఆర్డీవో కిషన్, పశుసంవర్ధకశాఖ అధికారి కిషన్, జిల్లా ఎస్సీ అభివృద్ధి అధికారి సునీతాకుమారి పాల్గొన్నారు.

లైంగికదాడి నిందితులను కఠినంగా శిక్షించాలి

ఆదిలాబాద్‌రూరల్: ఆదివాసీ యువతిపై ఎనిమిది నెలలుగా లైంగికదాడికి పాల్పడి గర్భిణిని చేసిన నలుగురు యువకులను వెంటనే అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని ఆదివాసీ హక్కుల పోరాట సమితి (తుడుం దెబ్బ) జిల్లా అధ్యక్షుడు గోడం గణేశ్ డిమాండ్ చేశారు. గురువారం మావల మండలం బట్టిసావర్‌గాం శివారు ప్రాంతంలోని సర్వేనంబర్ 72లోగల కుమురంభీం గూడలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అలాగే కొలాం మైనర్ బాలిక చేను పనులకు వెళ్తే లొంగదీసుకొని తులసిపేట గ్రామానికి చెందిన యువకులు గర్భిణిని చేశారని ఆరోపించారు. ఇలాంటి ఘటనలకు పాల్పడుతున్న వారిపై కఠినచర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. తుడుం దెబ్బ మహిళా సంఘం జిల్లా ఉపాధ్యక్షురాలు ఉయికే ఇందిర, ఆదిలాబాద్ డివిజన్ అధ్యక్షురాలు మెస్రం గంగాదేవి, మావల మండలాధ్యక్షుడు ఆత్రం గణపతి, ఉపాధ్యక్షుడు వెడ్మ ముకుంద్, కొట్నాక్ శ్యాంరావ్, కుమురంభీంగూడ కాలనీవాసులున్నారు.

ఆదిలాబాద్ పట్టణ ముఖచిత్రం



ఎర్లీబర్డ్ @5%

- ముందస్తు ఆస్తిపన్ను వసూలుకు చర్యలు
- ఈ నెలాఖరు వరకు చెల్లింపునకు గడువు
- 20 ప్రత్యేక బృందాలతో వసూలు
- ఐదురోజుల్లో బల్దియాకు రూ.27లక్షలు
- సవాల్‌గా తీసుకున్న ఆదిలాబాద్ బల్దియా

ఆదిలాబాద్ పట్టణంలోని అసెస్‌మెంట్లు: 20,140
వాటి పన్ను డిమాండ్: రూ.4,89,40,000
వాటికి ఐదుశాతం రాయితీ: రూ.24.47లక్షలు
విలీన గ్రామాల్లోని అసెస్‌మెంట్లు: 9,582
వాటి పన్ను డిమాండ్: రూ.1,13,71,946
వాటికి ఐదుశాతం రాయితీ: రూ.2,08,556

కైలాస్‌నగర్: మున్సిపాల్టీలో ఆస్తిపన్ను వసూళ్లపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. 2023–24 ఆర్థిక సంవత్సరానికి గాను ముందుగా పన్ను చెల్లించేలా ఎర్లీబర్డ్ పథకాన్ని ప్రవేశపెట్టింది. ఈ నెల 30వ తేదీ వరకు ఈ స్కీంను అమలు చేసేందుకు నిర్ణయించింది. నిర్దిష్ట గడువులోగా పన్ను చెల్లించేవారికి ఐదు శాతం రాయితీ కల్పిస్తోంది. నివాస, నివాసేతర భవనాలకు సంబంధించి ఎలాంటి బకాయిలు లేని వారిని రాయితీకి అర్హులుగా ప్రకటించింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు బకాయిలపై ప్రత్యేక దృష్టి సారించిన బల్దియా యంత్రాంగం గత ఐదు రోజుల్లోనే రూ.27లక్షలు వసూలు చేసింది.

20 ప్రత్యేక బృందాల నియామకం

ఆదిలాబాద్ పట్టణంతో పాటు విలీన గ్రామాల్లోని ఆరు బ్లాక్‌లలో 29,722 అసెస్‌మెంట్లు ఉన్నాయి. వీటికి గాను 2023–24 ఆర్థిక సంవత్సరానికి రూ.6,03,11,946 పన్ను డిమాండ్ ఉంది. ఈ మొత్తానికి ఐదు శాతం రాయితీని కల్పించారు. ఎర్లీబర్డ్ పథకం అమలులో భాగంగా ఈ పన్నుల వసూళ్లకు 20 ప్రత్యేక బృందాలను నియమించారు. ఒక్కో బృందంలో ముగ్గురు సభ్యులుంటారు. ఎలాంటి బకాయిలు లేని వారి వివరాలతో కూడిన జాబితాతో పాటు పీవోఎస్ యంత్రాలను వారికి అందజేశారు. దీంతో ఆయా బృందాలు వార్డుల్లో విస్తృతంగా తిరుగుతూ పన్నులు వసూలు చేస్తున్నారు. ఈ పథకంపై రోజువారీగా నివేదికలను అందించాలని ఉన్నతాధికారులు ఆదేశించిన నేపథ్యంలో పన్నుల వసూళ్లను బల్దియా సవాల్‌గా తీసుకుని ఆ దిశగా దృష్టి సారించింది. ఏటా ఆస్తి పన్నులో ప్రభుత్వం వడ్డీ మాఫీ అమలు చేస్తూ వస్తోంది. కోవిడ్ వేళ రూ.10వేల లోపు ఆస్తి పన్ను కలిగిన వారికి 50శాతం మాఫీ చేసిన ప్రభుత్వం తాజాగా ఎర్లీబర్డ్ స్కీంను అమలులోకి తెచ్చింది. ఈ నెల 30వ తేదీ వరకు ఈ స్కీం కింద పన్నులు చెల్లించే అవకాశం కల్పించింది.

స్కీంపై విస్తృత ప్రచారం

పట్టణ ప్రజలకు ఎర్లీబర్డ్ పథకంపై అవగాహన కల్పించేలా మున్సిపల్ అధికారులు విస్తృత ప్రచారం నిర్వహించేందుకు చర్యలు చేపట్టారు. ముఖ్యంగా వ్యాపారులు పన్నుల చెల్లింపునకు ముందుకువచ్చేలా పట్టణంలోని అన్ని బస్‌షెల్టర్లతో పాటు ప్రధాన కూడళ్లైన అంబేద్కర్‌చౌక్, శివాజీచౌక్, కలెక్టర్ చౌక్, బస్టాండ్ ఏరియాల్లో ఐదుశాతం రాయితీని సద్వినియోగం చేసుకునేలా ముద్రించిన ప్రత్యేక ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తున్నారు. అలాగే వార్డుల్లోని ప్రజలకు ఎర్లీబర్డ్ పథకం వివరాలు తెలియజేసేలా మైక్‌తో కూడిన ఆటో ద్వారా ప్రచారం కల్పిస్తున్నారు.

సద్వినియోగం చేసుకోవాలి



పన్నులు సకాలంలో వసూలు చేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఎర్లీబర్డ్ స్కీంను అమలు చేస్తోంది. ఈ నెల 30వ తేదీ వరకు పన్నులు చెల్లించిన వారికి ఐదు శాతం రాయితీ కల్పిస్తున్నాం. చాలామంది వ్యాపారులు, ప్రజలు మార్చిలోనే పన్ను చెల్లించేందుకు ఆసక్తి చూపుతున్నారు. మార్చిలో పన్ను చెల్లించిన వారికి అప్పటివరకున్న బకాయిలపై నెలకు 2శాతం చొప్పున 10 నెలల పాటు 20శాతం వడ్డీ పడుతుంది. దానికి దూరంగా ఉండాలంటే ప్రతి ఒక్కరూ ముందుగానే పన్నులు చెల్లించాలి. ఈ నెలలో పన్నులు చెల్లించడం ద్వారా ఐదుశాతం రాయితీతో పాటు 20శాతం వడ్డీ నుంచి కూడా విముక్తి పొందవచ్చు. పట్టణ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని సకాలంలో పన్నులు చెల్లించి బల్దియా అభివృద్ధికి సహకరించాలి.
– ఏ.శైలజ, మున్సిపల్ కమిషనర్

పవనసుతా.. పాహిమాం



శోభాయాత్రను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జోగు రామన్న, పక్కన నాయకులు, దీక్షాపరులు

- ఘనంగా హన్మాన్ జయంతి
- కిటకిటలాడిన ఆలయాలు
- వైభవంగా శోభాయాత్రలు

ఆదిలాబాద్: హన్మాన్ జయంతి సందర్భంగా జిల్లాలోని ఆలయాలు రామ లక్ష్మణ జానకీ.. జై బోలో హన్మాన్‌కీ.. నినాదాలతో మార్మోగాయి. జిల్లాలోని హన్మాన్ ఆలయాల్లో అర్చకులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. పల్లకీ సేవ, శోభాయాత్రలు భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. భక్తులు తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయాల వద్ద పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని రాంనగర్‌కాలనీలోని కోదండ సీతారామాలయం, సంజయ్‌నగర్ పంచముఖ ఆంజనేయస్వామి ఆలయం, విద్యానగర్ దాసాంజనేయస్వామి ఆలయం, అభయాంజనేయస్వామి, విజయ హన్మాన్ ఆలయాల్లో భక్తుల తాకిడి ఎక్కువగా కనిపించింది. భజరంగ్‌దళ్ , విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని శ్రీరామచంద్ర గోపాలకృష్ణ మఠం నుంచి హన్మాన్ శోభాయాత్ర నిర్వహించారు. యువత అధికసంఖ్యలో హాజరయ్యారు. కార్యక్రమాన్ని మఠాధిపతి యోగానంద సరస్వతి స్వామితోపాటు ఎమ్మెల్యే జోగు రామన్న ప్రారంభించారు. శోభాయాత్ర పట్టణంలోని ప్రధాన వీధుల గుండా కొనసాగింది. పట్టణంలోని పలు ఆలయాల్లో మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు చిట్యాల సుహాసినిరెడ్డి, బీజేపీ నాయకుడు కంది శ్రీనివాస్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు.



సంజయ్‌నగర్ కాలనీలో శోభాయాత్రలో మహిళలు



పల్లకితో శోభాయాత్ర నిర్వహిస్తున్న దీక్షాపరులు

విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్న ప్రభుత్వాలు



మాట్లాడుతున్న జగ్‌సింగ్

ఆదిలాబాద్‌టౌన్: రాజకీయ లబ్ధి కోసం బీజేపీ, బీఆర్ఎస్ ప్రభుత్వాలు విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్నాయని సీపీఐఎంఎల్ ప్రజాపంథా జిల్లా నాయకుడు జగ్‌సింగ్ ఆరోపించారు. గురువారం జిల్లా కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రశ్నపత్రాల లీకేజీ కుట్రకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్, ప్రశాంత్‌లే కారణమని బీఆర్ఎస్ ప్రభుత్వం, తెలంగాణ ప్రభుత్వమే కారణమని బీజేపీ నాయకులు పరస్పర ఆరోపణలు చేసుకుంటూ రాజకీయాలు చేయడం మానుకోవాలని హితవు పలికారు. విద్యా వ్యవస్థను మెరుగుపర్చాల్సిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యార్థుల జీవితాలతో రాజకీయాలు చేస్తున్నాయని మండిపడ్డారు. తక్షణమే పేపర్ లీకేజీ నిందితులను కఠినంగా శిక్షించి విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే తమ పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. నాయకులు కుమ్ర అశోక్, రజినీకాంత్, శ్యాంసుందర్ తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా ‘పది’ పరీక్షలు

ఆదిలాబాద్‌టౌన్: ఇటీవల పలు జిల్లాల్లో పదో తరగతి ప్రశ్నపత్రాలు లీక్ కావడంతో రాష్ట్ర విద్యాశాఖ అప్రమత్తమైంది. జిల్లాలో గురువారం ఇంగ్లిష్ పరీక్షను పకడ్బందీగా నిర్వహించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు 54 పరీక్ష కేంద్రాలకు పంచాయతీరాజ్‌శాఖకు సంబంధించిన అధికారులతో సిట్టింగ్ స్క్వాడ్‌లను ఏర్పాటు చేశారు. ఇన్విజిలెటర్లు, చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంటల్ అధికారులు పరీక్ష కేంద్రంలోకి సెల్‌ఫోన్లు తీసుకురాకుండా చర్యలు చేపట్టారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ పకడ్బందీగా అమలు చేశారు. ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి ఆదిలాబాద్ పట్టణంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్, ప్రభుత్వ బాలుర రెసిడెన్షియల్ పాఠశాల, ఎస్ఆర్‌డిజీ తదితర కేంద్రాలను పరిశీలించారు. కలెక్టర్ రాహుల్‌రాజ్‌తో పాటు అదనపు కలెక్టర్ రిజ్వాన్ బాషాషేక్, డీఈవో ప్రణీత, పరీక్షల విభాగం జిల్లా అసిస్టెంట్ కమిషనర్ వేణుగోపాల్‌రెడ్డి, ఫ్లయింగ్ స్క్వాడ్‌లు పలు కేంద్రాలను తనిఖీ చేశారు.



సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

యాపల్‌గూడ కేంద్రం తనిఖీ

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని యాపల్‌గూడ పదో తరగతి పరీక్షా కేంద్రాన్ని ఎస్పీ ఉదయ్‌కుమార్ రెడ్డి తనిఖీ చేశారు. పోలీసులకు పలు సూచనలు చేశారు. పరీక్ష కేంద్రం వద్ద 100 మీటర్ల వరకు 144 సెక్షన్ అమలులో ఉన్నందున ఆ పరిధిలోకి ఎవరినీ రానీయవద్దని, కేంద్రంలోకి సెల్‌ఫోన్లతో ఎవరినీ అనుమతించరాదని సూచించారు. ఆయన వెంట మావల ఎస్సై విష్ణువర్ధన్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

నేడు రిమ్స్‌లో మెగా రక్తదాన శిబిరం



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్

కైలాస్‌నగర్: ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 7వ తేదీన జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆడిటోరియంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ తెలిపారు. గురువారం ఆయన కలెక్టర్ రాహుల్ రాజ్‌ను తన కార్యాలయంలో కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేసి ఆహ్వానించారు. ఉదయం 10నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు నిర్వహించే శిబిరంలో సుమారు 100మంది రిమ్స్ వైద్య కళాశాల, ఆసుపత్రి వైద్యులు, ప్రభుత్వ, ప్రైవేట్ వైద్యులు, జూడాలు రక్తదానం చేయనున్నట్లు పేర్కొన్నారు. కలెక్టర్ రాహుల్‌రాజ్‌ను కలిసిన వారిలో డాక్టర్ సుమలత తదితరులున్నారు.

రోగులకు నాణ్యమైన సేవలందించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జోగు రామన్న

- కలెక్టర్ రాహుల్‌రాజ్
- రూ.41.50 లక్షల పెండింగ్ బిల్లుల చెల్లింపునకు తీర్మానం

ఆదిలాబాద్‌టౌన్: రిమ్స్ ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన సేవలందించాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ సూచించారు. గురువారం రిమ్స్ ఆసుపత్రి సమావేశ మందిరంలో ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించగా ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. జిల్లాలోని ప్రాథమిక, కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రాల నుంచి రిమ్స్ ఆసుపత్రికి వచ్చే రోగులకు వైద్యుల సమన్వయంతో మెరుగైన సేవలందించాలని సూచించారు. రక్త సేకరణలో రిమ్స్ బ్లడ్‌బ్యాంక్ రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిచిందని తెలిపారు. సాధారణ ప్రసవాల సంఖ్య పెంపులో రాష్ట్రంలోనే జిల్లా రెండో స్థానంలో నిలవడం అభినందనీయమన్నారు. ఇదే స్ఫూర్తితో పనిచేస్తూ జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. అనంతరం రిమ్స్ ఆసుపత్రిలో ప్రతీనెల నమోదయ్యే ఇన్, అవుట్ పేషెంట్లు, వారికి అందిస్తున్న అత్యవసర సేవలు, సూపర్ స్పెషాలిటీ సేవలు, వైద్యులు, సిబ్బంది ఖాళీల వివరాలు తెలుసుకున్నారు. ఎమ్మెల్యే జోగు రామన్న మాట్లాడుతూ.. రిమ్స్ ఆసుపత్రి అభివృద్ధికి అన్ని రకాల సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. అభివృద్ధి పనులకు సంబంధించిన వివిధ పెండింగ్ బిల్లులకు రూ.41.50 లక్షలు చెల్లించడానికి కమిటీ తీర్మానించిందని తెలిపారు. మారుమూల ప్రాంతాల నుంచి వచ్చే రోగులకు డాక్టర్లు, వైద్య సిబ్బంది అందుబాటులో ఉండి నాణ్యమైన సేవలు అందించాలని సూచించారు. అంతకుముందు రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ ఆసుపత్రిలో చేపట్టనున్న అభివృద్ధి పనులను పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. ట్రెయినీ అసిస్టెంట్ కలెక్టర్ పీ శ్రీజ, డీసీహెచ్‌ఎస్ ఉపేందర్, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

అడవుల రక్షణ అందరి బాధ్యత

బజార్‌హత్నూర్: అడవుల రక్షణ ప్రతీ ఒక్కరి బాధ్యత అని డీఎఫ్‌వో రాజశేఖర్ పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలో అటవీశాఖ కార్యాలయ నూతన భవన నిర్మాణ పనులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చెట్లను నరికే, కలప స్మగ్లింగ్ చేసేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అటవీ ప్రాంతంలో ఏ ఒక్క చెట్టునూ నరికివేయకుండా బీట్ స్థాయిలో పర్యవేక్షణ జరపాలని ఆదేశించారు. అవసరమైతే పోలీసుల సహాయం తీసుకోవాలని సూచించారు. డీఎఫ్‌వో బర్నొబా, ఎఫ్ఆర్వో పాండురంగ్, ఎఫ్ఎస్‌వో ప్రవీణ్, బీట్ ఆఫీసర్లు ప్రీతమ్, వెంకటేశ్, ఈశ్వర్, మాజీ సర్పంచ్ పర్చ సాయన్న, నానం రమణ పాల్గొన్నారు.



పనులు పరిశీలిస్తున్న డీఎఫ్‌వో రాజశేఖర్

ఎంఐఎం ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు

కైలాస్‌నగర్: రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని ఎంఐఎం ఆధ్వర్యంలో గురువారం ఆదిలాబాద్ పట్టణంలోని ఉర్దూ ఘర్ షాదీఖానలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. నాంపల్లి ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజ్, స్థానిక ఎమ్మెల్యే జోగు రామన్న, డీసీసీ అధ్యక్షుడు సాజిద్‌ఖాన్, డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, మున్సిపల్ వైస్‌చైర్మన్ జహీర్ రంజానీ తదితరులు పాల్గొన్నారు. ముందుగా ప్రత్యేక ప్రార్థనల అనంతరం ఉపవాస దీక్షలు విరమించారు. అంతకుముందు నాంపల్లి ఎమ్మెల్యేను జోగు రామన్న పూలమాల, శాలువాతో సత్కరించారు. ఎంఐఎం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి నజీర్, రషీద్, నాయకులు అశోక్, జాఫర్ తదితరులు పాల్గొన్నారు.



ఎంఐఎం ఎమ్మెల్యేకు ఫ్రూట్ తినిపిస్తున్న జోగు రామన్న

ఆలయాల అభివృద్ధికి కృషి

ఇంద్రవెల్లి: ఆలయాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్ పేర్కొన్నారు. గురువారం మండలంలోని వాల్గొండ గ్రామపంచాయతీ పరిధి పొల్లుగూడ గ్రామంలో నిర్వహించిన హన్మాన్ మందిర ప్రారంభోత్సవం, విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమానికి హాజరయ్యారు. ముందుగా ఆలయంలో పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని చెప్పారు. తమ గ్రామానికి రోడ్డు లేదని, మిషన్ భగీరథ నీరు ప్రతీరోజు రావడం లేదని గ్రామస్తులు ఈ సందర్భంగా ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. గ్రామానికి బీటీ రోడ్డు మంజూరు చేయడంతో పాటు మిషన్ భగీరథ నీరు సరఫరా చేసేందుకు కృషి చేస్తానని, ఆలయ అభివృద్ధికి రూ.3లక్షలు మంజూరు చేయిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. అనంతరం పొల్లుగూడ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో అతిథులను శాలువాలతో సన్మానించారు. ఏఎంసీ చైర్మన్ జాదవ్ శ్రీరాం నాయక్, పీఏసీఎస్ చైర్మన్ మారుతి డోంగ్రె, సర్పంచులు కోరెంగా గాంధారి, కినక జుగాదిరావ్, బీఆర్ఎస్ నాయకులు దేవ్‌పూజే మారుతి, పొల్లుగూడ గ్రామ పెద్దలు కోరెంగా శంభు, ఆత్రం శంకర్, కోరెంగా లక్కు, కోరెంగా లింగుపటేల్, జుగ్నాక్ కాశీరాం, యూత్ సభ్యులు జుగ్నాక్ భరత్, మర్సుకోల నాందేవ్, జాలింషావ్ తదితరులున్నారు.



హన్మాన్ మందిరంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే రేఖానాయక్, నాయకులు

క్లుప్తంగా

నేడు అంతర్రాష్ట్ర కుస్తీ పోటీలు

కుంటాల: మండల కేంద్రంలోని మహాదేవుని పౌర్ణమి, హనుమాన్ జయంతి సందర్భంగా శుక్రవారం అంతర్రాష్ట్ర కుస్తీ పోటీలు నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ దొనికెన సమత వెంకటేష్ తెలిపారు. మల్లయోధులు పెద్ద సంఖ్యలో హాజరై కుస్తీ పోటీలను విజయవంతం చేయాలని కోరారు.

మినీ గురుకులాల్లో అడ్మిషన్లు ప్రారంభం

నార్నూర్/ఉట్నూర్: మినీ గురుకులాల్లో 2023–24 విద్యా సంవత్సరానికి అడ్మిషన్ల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆర్‌సీవో గంగాధర్ తెలిపారు. గురువారం ఏకలవ్య గురుకుల పాఠశాలలో ఆయన మాట్లాడారు. ఒకటో తరగతి నుంచి 5వ తరగతి వరకు సీట్ల భర్తీ చేయనున్నట్లు తెలిపారు. నేటి వచ్చే నెల నాల్గో తేదీ వరకు దరఖాస్తులకు అవకాశం కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు.

చేనేత ఐక్యవేదిక రాష్ట్ర కార్యదర్శిగా శ్రీనివాస్


బండ శ్రీనివాస్

ఆదిలాబాద్‌టౌన్: జాతీయ చేనేత ఐక్యవేదిక రాష్ట్ర కార్యదర్శిగా ఆదిలాబాద్ పట్టణానికి చెందిన బండ శ్రీనివాస్‌ను నియమిస్తూ ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాపోలు వీరమోహన్ ఉత్తర్వులు గురువారం జారీ చేశారు. చేనేత ఐక్యవేదిక కార్మికుల పరిరక్షణ కోసం కృషి చేయాలని సూచించారు.

మొక్కజొన్న పంట దగ్ధం

లోకేశ్వరం: మండలంలోని గౌరోల్ల పెద్ద భూమన్నకు చెందిన మొక్కజొన్న పంట విద్యుత్‌షాక్‌తో దగ్ధమైంది. భూమన్న మొక్కజొన్న పంట కోసి చేనులో అరబెట్టాడు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లో నుంచి బుధవారం రాత్రి నిప్పురావడంతో దగ్ధమైంది.

అన్నం తినేందుకు వెళ్తూ అనంతలోకాలకు..

- ప్రమాదవశాత్తు బస్సు ఢీకొని కండక్టర్ మృతి
- మంచిర్యాల ఆర్టీసీ డిపో గేటు ఎదుట ఘటన
- మృతుడు ఆదిలాబాద్ డిపోకు చెందిన కండక్టర్


గంగారాం (ఫైల్)


ఘటనాస్థలంలో గంగారాం మృతదేహం

మంచిర్యాలక్రైం/ఆదిలాబాద్: విధి నిర్వహణలో ఉన్న ఓ ఆర్టీసీ కండక్టర్ అన్నం తినేందుకు వెళ్తూ ప్రమాదవశాత్తు బస్సు టైరు కిందపడి మృతి చెందిన ఘటన మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ డిపో గేటు ఎదుట చోటు చేసుకుంది. ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండలం భరంపూర గ్రామానికి చెందిన బాతూరి గంగారాం (54) ఆదిలాబాద్ ఆర్టీసీ డిపోలో కండక్టర్‌గా పనిచేస్తున్నాడు. విధుల్లో భాగంగా గురువారం ఉదయం ఆదిలాబాద్ నుంచి బయలుదేరగా 10:50 గంటలకు మంచిర్యాల బస్టాండ్‌కు చేరుకున్నారు. ఇంకా 15, 20 నిమిషాల టైం ఉండడంతో డ్రైవర్ బస్సును పాయింట్ మీద నిలిపారు. కండక్టర్ గంగారాం భోజనం చేసేందుకు టిఫిన్ బాక్స్ పట్టుకుని డిపోలోకి వెళ్తున్నాడు. అప్పటికే హైదరాబాద్ నుంచి వచ్చిన సూపర్ లగ్జరీ బస్సు డిపో లోపలికి వెళ్లేందుకు సెక్యూరిటీ గది ముందు ఆగి ఉంది. డ్రైవర్ వాసాల తిరుపతి కుడివైపు ఉన్న కార్యాలయంలోని సెక్యూరిటీ అధికారులతో మాట్లాడుతున్నాడు. ఎడమవైపు నుంచి వచ్చిన గంగారాం లోనికి వెళ్తుండగా గమనించని డ్రైవర్ తిరుపతి బస్సును స్టార్ట్ చేశాడు. బస్సు ముందుకు కదలడంతో ఎడమవైపు నుంచి వచ్చిన గంగారాంను ఢీకొట్టింది. కండక్టర్ కిందపడిపోవడంతో గమనించకుండానే డ్రైవర్ బస్సును ముందుకు తోలడంతో వెనుకటైరు గంగారాం తలమీదినుంచి వెళ్లింది. దీంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని చూసిన ప్రయాణికులు, తోటి కండక్టర్లు, డ్రైవర్లు కంటతడి పెట్టుకున్నారు. ఘటన స్థలానికి చేరుకున్న ఎస్సై తైసినొద్దీన్ ప్రమాద వివరాలు సేకరించి పంచనామా నిర్వహించారు. మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతునికి భార్య పద్మ, కుమారుడు మనోజ్‌కుమార్, ఇద్దరు కూతుర్లు ఉన్నారు. కుమారుడి ఫిర్యాదు మేరకు డ్రైవర్ తిరుపతిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

డ్రైవర్ తొందరపాటే ప్రమాదానికి కారణమా?

మంచిర్యాల డిపోకు చెందిన సూపర్ లగ్జరీ హైదరాబాద్ నుంచి వచ్చింది. డిపోలో బస్సును అప్పగించి ఇంటికి వెళ్లాలన్న డ్రైవర్ తొందరపాటే ప్రమాదానికి కారణమైందని స్థానికులు, ఆర్టీసీ సిబ్బంది పేర్కొంటున్నారు. బస్సు కిందపడిన కండక్టర్ అరుపులు విని డ్రైవర్ అప్రమత్తమై ఉంటే ప్రాణనష్టం జరిగేది కాదని ఆర్టీసీ సిబ్బంది పేర్కొన్నారు.

వ్యాన్‌లో విద్యార్థుల తరలింపు


జిల్లాలో పదో తరగతి పరీక్షలు నడుస్తున్న నేపథ్యంలో జ్వరంగాపూర్ మండలం గంగాపూర్ సమీపంలోని ఎస్టీ ఆశ్రమ పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థులకు జిల్లా కేంద్రంలోని పలు పాఠశాలలో పరీక్ష కేంద్రాలు కేటాయించారు. దీంతో పాఠశాల యాజమాన్యం విద్యార్థులను డీసీఎం వ్యాన్ ద్వారా ఆయా పరీక్ష కేంద్రాలకు తరలిస్తున్నారు. పశువులను తరలించినట్లుగా విద్యార్థులను డీసీఎం వ్యాన్‌లో తరలించడంపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.
- నిర్మల్‌చైన్‌గేట్

కుక్కల దాడిలో 16 జీవాలు మృతి

నిర్మల్ జిల్లా కుంటాల మండలంలోని అందాకూర్ గ్రామంలో కుక్కల దాడిలో ఆరు మేకపిల్లలు మృతిచెందగా... ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండలంలోని దేవాపూర్ గ్రామంలో పది మేక పిల్లలు చనిపోయాయి. దీంతో గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు.


మృతిచెందిన మేక పిల్లలు

కుంటాలలో ఆరు..

కుంటాల: మండలంలోని అందాకూర్ గ్రామంలో గురువారం కుక్కల దాడిలో బీరప్పకు చెందిన ఆరు మేకపిల్లలు మృతి చెందాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... బీరప్ప రోజు మాదిరిగానే మేకలను మేతకు తీసుకువెళ్లాడు. పశువుల పాకలో మేకపిల్లల ఉండగా కుక్కలు దాడి చేయడంతో ఆరు మేకపిల్లలు చనిపోయాయి. మరో రెండు మేక పిల్లల పరిస్థితి విషమంగా ఉంది. పశువైద్యాధికారి ప్రకాష్ ఘటనా స్థలానికి చేరుకుని పంచనామా నిర్వహించారు. రెండు రోజుల క్రితం కుంటాలకు చెందిన కక్కెర ముత్యంరావు కు చెందిన మేకల మందపై కుక్కలు దా డి చేయడంతో రెండు మేకలు మృతి చెందిన ట్లు ఆలస్యంగా వెలు గు చూసింది. కుక్కల ను నియంత్రించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

తలమడుగులో పది గొర్రెపిల్లలు..

తలమడుగు: మండలంలోని దేవాపూర్ గ్రామానికి చెందిన గొల్లేని స్వామి గొర్రెలు మేపడానికి వెళ్లాడు. గొర్రె పిల్లలను కొట్టంలో ఉంచాడు. గురువారం సాయంత్రం సమయంలో కుక్కలు కొట్టంలోకి చొరబడి దాడిచేయడంతో 10 గొర్రెపిల్లలు చనిపోయాయి. దీంతో బాధితుడు స్వామి ఆర్థికంగా తీవ్ర నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం ఆదుకోవాలని, అధికారులు కుక్కల బెడద లేకుండా చర్యలు తీసుకోవాలని వేడుకుంటున్నాడు. సంఘటన స్థలానికి మండల పశువైద్యాధికారి దూద్‌రామ్ రాథోడ్ చేరుకుని నిర్ధారించాడు.

నిన్ను సైతం తీసుకెళ్లాడా..!

- కుమారుడి మృతితో రోదించిన తల్లి..
- ఇటీవల భర్త మృత్యువాత
- కుటుంబానికి ఆసరాగా ఉండేందుకు పనికి వెళ్తున్న బాలుడు
- టెంట్‌హౌజ్ సామగ్రి శుభ్రం చేస్తూ చెరువులో జారిపడిన వైనం


ఉడుత గణేష్(ఫైల్)


మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై


రోదిస్తున్న తల్లి, కుటుంబ సభ్యులు

సారంగపూర్: ఆ దేవుడు .. నిన్ను సైతం తీసుకెళ్లాడా గణేశా.. నాకు తోడుగా ఉంటావనుకుంటే ఇలా మధ్యలోనే వదిలేసి వెళ్లిపోయావా అంటూ ఆ తల్లి రోదించిన తీరు అక్కడి వారిని కంటతడి పెట్టించింది. ఇటీవల భర్త చనిపోగా ఇప్పుడు కుమారుడు సైతం మృతిచెందడంతో ఆ తల్లి గుండెలు అవిసెలా విలపించింది. స్థానికుల వివరాల ప్రకారం... మండల కేంద్రానికి చెందిన ఉడుత నర్సయ్య, స్వప్న దంపతులకు నలుగురు సంతానం. ఇందులో ఇద్దరు కూతుర్లు, ఇద్దరు కుమారులున్నారు. నర్సయ్య 11 నెలల క్రితం అనారోగ్యంతో మృతిచెందాడు. అప్పటి నుంచి కుటుంబ బాధ్యత స్వప్నపై పడింది. తల్లి బీడీలు చుడితే వచ్చే డబ్బులు సరిపోకపోవడంతో గమనించిన కుమారుడు గణేశ్(14) స్థానిక ప్రభుత్వ పాఠశాలలో 9వ తరగతి చదువుకుంటూనే టెంట్‌హౌజ్‌లో పనిచేస్తూ కుటుంబానికి ఆసరాగా నిలిచాడు. ఈ క్రమంలో బుధవారం సాయంత్రం టెంట్‌హౌజ్‌లోని సామగ్రిని శుభ్రం చేసేందుకు అందులో పనిచేసే వారితో కలిసి స్థానిక అంబవాయి చెరువుకు వెళ్లాడు. వాటిని శుభ్రం చేసే క్రమంలో ప్రమాదవశాత్తు గణేష్ చెరువులో జారి పడిపోయాడు. గమనించిన తోటి వారు టెంట్‌హౌజ్ యజమాని, గ్రామస్తులకు సమాచారం ఇచ్చారు. చీకటి పడడంతో గురువారం ఉదయం నుంచి మత్స్యకారులతో గాలింపు చర్యలు చేపట్టారు. సాయంత్రం సమయంలో మృతదేహం లభ్యమైంది. చిన్న వయస్సులోనే కుటుంబ బాధ్యతలు తీసుకున్న కుమారుడి మృతితో ఆ తల్లి గుండెలు పగిలేలా రోదించింది. తల్లి ఫిర్యాదుతో టెంట్‌హౌజ్ యజమానిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కృష్ణాసాగర్‌రెడ్డి తెలిపారు.














రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

- ప్రాణం తీసిన ఇరుకురోడ్డు..


ధర్మపురి మృతదేహం

ఖానాపూర్: రోడ్డు ప్రమాదానికి గురైన వృద్ధుడు చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన గురువారం చోటుచేసుకుంది. ఎస్సై ఆర్ శంకర్ తెలిపిన వివరాల ప్రకారం.. పద్మావతినగర్ కాలనీకి చెందిన కారింగుల ధర్మపురి (72) గురువారం విద్యానగర్‌లోని పోస్టాఫీసుకు పెన్షన్ కోసం వెళ్లి బస్టాండ్ వైపు బైక్‌పై తిరిగి వస్తున్నాడు. ఈ క్రమంలో బస్టాండ్ నుంచి విద్యానగర్ వైపు వెళ్తున్న అల్లెపు రవికి చెందిన కంకర ట్రాక్టర్ ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో ధర్మపురి తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడిని స్థానికులు 108లో ప్రభుత్వాస్పత్రికి, అక్కడి నుంచి నిర్మల్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి గురువారం మృతిచెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.పట్టణంలో ఏడాదిన్నర కాలంగా రోడ్డు వైడింగ్ పనులు నత్తనడకన సాగడమే ఈ ప్రమాదానికి కారణమైందని స్థానికులు పేర్కొంటున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

లక్ష్మణచాంద: బస్సు, బైక్ ఎదురెదురుగా ఢీకొన్న సంఘటనలో ఒకరికి గాయాలయ్యాయి. ఈ సంఘటన మండలంలోని బాబాపూర్ చెక్ పోస్టు వద్ద చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే... మండలంలోని నర్సాపూర్ గ్రామానికి చెందిన రాజు (30) గ్రామ సమీపంలోని చేను నుంచి గరువారం సాయంత్రం ఇంటికి తిరిగి వచ్చేక్రమంలో బాబాపూర్ చెక్ పోస్టు వద్ద ఎదురుగా వచ్చిన ఆర్టీసీ బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో రాజుకు గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే నిర్మల్ ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాహుల్ గైక్వాడ్ తెలిపారు.

పోక్సో కేసులో యువకుడి రిమాండ్

ఆదిలాబాద్‌రూరల్: ఆదిలాబాద్ రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రణదీవేనగర్‌కు చెందిన సాయినాథ్(22)ను పోక్సో కేసులో అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ రఘుపతి తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. ఆదిలాబాద్ రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓ మైనర్‌ను పెళ్లి చేసుకుంటానని చెప్పి కుటుంబ సభ్యులకు తెలియకుండా ఇంటి నుంచి తీసుకెళ్లాడు. దీంతో ఆ బాలిక కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఈ నెల 4వ తేదీన మిస్సింగ్ కేసు నమోదైంది. సదరు యువకుడు మోసం చేయడంతో గురువారం పోలీస్‌స్టేషన్‌లో బాధితురాలు కుటుంబ సభ్యులతో కలిసి ఫిర్యాదు చేసింది. దీంతో పోక్సో యాక్టు కింద కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

దాడి చేసిన ఇద్దరిపై కేసు నమోదు

ఆదిలాబాద్‌టౌన్: నార్నూర్ మండలం సుంగాపూర్‌కు చెందిన జాదవ్ జ్యోతిపై దాడి చేసిన ఇద్దరిపై టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు ఎస్సై విష్ణుప్రకాశ్ తెలిపారు. జ్యోతి కూతురు ఐశ్వర్య పురుగుల మందుతాగి ఈ నెల 4వ తేదీన రిమ్స్‌లో మృతిచెందిన విషయం తెలిసిందే. ఆ సమయంలో జ్యోతి తన కూతురు వరకట్నం వేధింపులతోనే ఆత్మహత్యకు పాల్పడిందని కుటుంబ సభ్యులతో కలిసి ఆందోళనకు దిగింది. ఆ సమయంలో ఐశ్వర్య చిన మామ బండారి శ్రీరంగ్, ఆయన కుమారుడు దీపక్‌లు జ్యోతిపై దాడి చేశారు. దీంతో ఆమె పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు టూ టౌన్ తెలిపారు.

పురుగుల మందు తాగి యువకుడి ఆత్మహత్య

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని యశ్వంత్‌గూడ గ్రామ పంచాయతీ పరిధిలోని మత్తడిగూడ గ్రామానికి చెందిన సలాం భూమన్న (25) పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికుల కథనం ప్రకారం.. భూమన్నకు ఏడాది క్రితం టాక్లీ గ్రామానికి చెందిన యువతితో వివాహమైంది. బుధవారం భార్యాభర్తలు కలిసి కాలినడకన టాక్లీ గ్రామానికి బయలుదేరారు. మార్గంమధ్యలో పక్కకు వెళ్లి పురుగుల మందు తాగాడు. గమనించిన భార్య బంధువులకు సమాచారం ఇచ్చింది. వెంటనే వారు చేరుకుని జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి గురువారం మృతి చెందాడు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు. ఈ విషయంపై పోలీసులను సంప్రదించగా ఫిర్యాదు అందలేదని తెలిపారు.

ఆకట్టుకున్న కుస్తీ పోటీలు


ముధోల్‌లో కుస్తీ పోటీలు

ముధోల్: మండల కేంద్రంలోని జలశంకర ఆలయ ప్రాంగణంలో గురువారం గ్రామాభివృద్ధి కమిటీ (వీడీసీ) ఆధ్వర్యంలో కుస్తీ పోటీలు నిర్వహించారు. నిర్మల్ జిల్లాలోని వివిధ మండలాలతో పాటు మహారాష్ట్రలోని పలు ప్రాంతాలకు చెందిన మల్లయోధులు కుస్తీ పోటీల్లో పాల్గొన్నారు. ఈ పోటీల్లో గెలుపొందిన విజేతకు రూ.5 వేల నగదు బహుమతి అందించారు. హనుమాన్ జయంతి వేడుకలను పురస్కరించుకుని ప్రతి సంవత్సరం వీడీసీ ఆధ్వర్యంలో కుస్తీ పోటీలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందని గ్రామ పెద్దలు తెలిపారు. ఈ పోటీలను తిలకించేందుకు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఎస్సై సాయికిరణ్ నేతృత్వంలో పోలీసు సిబ్బందితో గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ వెంకటాపూర్ రాజేందర్, ఎంపీటీసీ సభ్యులు దేవోజి భూమేష్, సరళ శ్రీనివాస్‌గౌడ్, వీడీసీ అధ్యక్షుడు గుంజలొల్ల నారాయణ, ప్యాక్స్ డైరెక్టర్ ధర్మపురి సుదర్శన్, మాజీ ఎంపీపీ ఎజాజోద్దీన్, వీడీసీ ఉపాధ్యక్షుడు ఆనంద్‌రావుపటేల్, కార్యదర్శి నారాయణ, కోశాధికారి సాయినాథ్ ఉన్నారు.

ప్రమాదవశాత్తు ఇల్లు దగ్ధం

బోథ్: మండలంలోని కుచులాపూర్ గ్రామంలో గురువారం రాత్రి 8.30గంటలకు సీరం సుదర్శన్ అనే వ్యక్తికి చెందిన ఇల్లు ప్రమాదవశాత్తు దగ్ధమైంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సుదర్శన్ ఇంట్లో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. గమనించిన కుటుంబీకులు వెంటనే బయటకు వచ్చారు. ఇంట్లోని వస్తువులు, నగదు, బట్టలు, ఇతర సామగ్రి పూర్తిగా కాలిబూడిదయ్యాయి. అక్కడే ఉన్న బైక్ కాలిపోయింది. స్థానికులు మంటలు ఆర్పే ప్రయత్నం చేయగా, అప్పటికే ఇల్లు పూర్తిగా కాలిపోయింది. ఆ తర్వాత ఇచ్చోడ నుంచి ఫైరింజన్ రాగా గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తంజేశారు. ఫైర్‌ఇంజిన్ ఎదుట ధర్నాకు దిగారు. గ్రామం నుంచి వెళ్లనివ్వబోమని రోడ్డుపై బైఠాయించారు. బోథ్‌లో ఫైర్‌స్టేషన్‌ను ఏర్పాటు చేయాలని, బాధిత కుటుంబానికి ప్రభుత్వం పరిహారం అందించాలని డిమాండ్ చేశారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం


హనుమాన్ ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు


హోమంలో పాల్గొన్న భక్తులు

ఇంద్రవెల్లి: మండలంలోని వాల్గొండ గ్రామపంచాయతీ పరిధిలోని పోల్లుగూడ గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో గురువారం హనుమాన్ జయంతి సందర్భంగా విగ్రహ ప్రతిష్ఠాపన వైభవంగా నిర్వహించారు. గ్రామ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో కోడప వినాయక్‌రావ్ మహారాజ్ ప్రత్యేక పూజల మధ్య విగ్రహ ప్రతిష్ఠాపన చేశారు. అనంతరం గ్రామ ఆడపడుచులకు కొత్త వస్త్రాలు అందించారు. సంప్రదాయంగా కలశాన్ని గ్రామంలో శోభాయాత్ర నిర్వహించారు. ఇంటింటా మహిళలు కలశానికి పూజలు చేశారు. ఇందులో ఇంద్రవెల్లి ఎస్సై సునిత్, తుడుందెబ్బ జిల్లా అధ్యక్షులు గోడం గణేష్, ఆదివాసీ సంఘాల నాయకులు పుర్క బాపురావ్, పెందోర్ పుష్పరాణి హాజరై పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పటేల్ కోరెంగా శంభు, గ్రామ పెద్దలు మహదు ఉన్నారు.

అడవులను పరిశీలించిన ఎఫ్‌సీఆర్‌ఐ విద్యార్థులు


నీటికుంటను పరిశీలిస్తున్న విద్యార్థులు

పెంబి: పెంబి రేంజ్ పరిధిలోని తాటిగూడ, పెంబి సెక్షన్ పరిధిలోని అటవీ ప్రాంతాన్ని, నీటి కుంటలు, నీటి తొట్టెలను ములుగు జిల్లాలోని (ఎఫ్‌సీఆర్‌ఐ) ఫారెస్ట్ రీసెర్చ్ ఇన్స్టిట్యూట్‌కు చెందిన 60మంది విద్యార్థులు గురువారం పెంబి ఎఫ్‌ఆర్‌వో రామకృష్ణా ఆధ్వర్యంలో సందర్శించారు. అడవిలోని చెట్ల రకాలు, అటవీ ప్రాంతంలోని నీటి కుంటలు, అడవి జంతువుల కోసం ఏర్పాటు చేసిన నీటి తొట్టెలు(సాసర్) పరిశీలించారు. వారి వెంట ఎఫ్‌ఎస్‌వోలు రవి, శ్రీనివాస్ ఉన్నారు.

క్షుద్రపూజల కలకలం...?


తవ్వకాలు చేసిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎస్సై, తహసీల్దార్

ఖానాపూర్: మండలంలోని తర్లపాడ్ గ్రామ పొలిమేరలోని ఇండెన్ గ్యాస్ గోదాం వెనుక భాగంలో బుధవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు తవ్వకాలు చేపట్టిన ఘటన కలకలం రేపింది. ఖానాపూర్‌కు చెందిన ముడికె మల్లయ్యకు చెందిన పంట పొలం వద్ద తవ్వకాలను చేపట్టారు. కాగా తవ్వకాలు చేసిన ప్రాంతంలో పసుపు, కుంకుమతో పాటు అగరుబత్తులు ఉండడంతో గుప్తనిధుల కోసం తవ్వకాలు చేసి ఉంటారని అనుమానిస్తున్నారు. ఎస్సై శంకర్, తహసీల్దార్ రాజమోహన్ సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. దీంతో నిలువెత్తు తవ్విన గుంతలో మట్టి పూడ్చి ఉండడంతో అందులో ఏదైనా ఉందా అనే అనుమానంతో జేసీబీతో తవ్వకాలు చేపట్టినప్పటికీ ఎలాంటి ఆనవాళ్లు కానరాలేదు. తవ్వకాలు ఎందుకు చేశారనేది తెలియాల్సి ఉంది.

బీజేపీ నాయకుల వినూత్న నిరసన

ఖానాపూర్: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ పేపర్ లీకేజీ పేరుతో అక్రమ కేసులు బనాయించడం సరికాదని బీజేపీ నాయకులు గురువారం పట్టణంలోని తెలంగాణ తల్లి చౌరస్తాలో వినూత్న నిరసన చేపట్టారు. కళ్లకు గంతలు కట్టుకుని, చేతులకు సంకెళ్లు వేసుకుని నిరసనలో పాల్గొన్నారు. బీజేపీ నియోజకవర్గ నాయకురాలు, పెంబి జెడ్పీటీసీ జానుబాయి మాట్లాడుతూ ప్రభుత్వం నిరంకుశ ధోరణితో అప్రజాస్వామికంగా వ్యవహరిస్తోందన్నారు. కేసుతో ఎలాంటి సంబంధం లేని బండి సంజయ్‌ని రాజకీయంగా ఎదుర్కొలేకనే తప్పుడు కేసులు బనాయించి ఇబ్బందులకు గురిచేస్తుందన్నారు. వెంటనే సంజయ్‌పై కేసులను ఎత్తేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు పడాల రాజశేఖర్, నాయిని సంతోష్, ఆకుల శ్రీనివాస్, తోకల బుచ్చన్న, అంకం మహేందర్, లాండేరి కిషన్, చందుపట్ల శ్రావణ్, దేశాయి రాము, ఇనుముల స్వామి, సిరిగారపు లింగన్న, గోపాల్ రెడ్డి, బుర్ర రమేశ్, లక్కవత్తుల రాజేశ్వర్, పిట్టల భూమన్న, ఆసం సాయి, జీవన్ ఉన్నారు.